క్లుప్తంగా

జిమ్నాస్టిక్స్‌లో చిన్నారుల ప్రతిభ


కే.విజ్ఞత


కే.స్వేచ్ఛ

సాక్షి, సిటీబ్యూరో: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగిన 'సీఎం కోహినూర్ రిథమిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్–2023' లో జూనియర్ కేటగిరీలో అత్తాపూర్ ప్రాంతానికి చెందిన కే.విజ్ఞత కాంస్య పతకం సాధించింది. చిల్డ్రన్ కేటగిరి సీ గ్రూప్‌లో ఫ్రీహ్యాండ్ విభాగంలో స్వేచ్ఛ బంగారు పతకం సాధించింది. వారికి రాష్ట్ర టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులను అత్తాపూర్ జనప్రియవాసులు అభినందించారు.

గుడిమల్కాపూర్‌లో 'ఆయుష్మాన్ భారత్'

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లోని శ్రీకృష్ణభవన్ వద్ద ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యబీమా కార్డు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆయన బీజేపీ నాయకులు దేవర వంశీతో కలిసి ప్రారంభించారు. పేద బడుగు వర్గాల వారికోసం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భీమా వరంలాంటిదని ఆయన అన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేసుకుంటే సంవత్సరానికి రూ.5 ఆరోగ్యబీమా సౌకర్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

తాళాలు పగులగొట్టి చోరీ

రాజేంద్రనగర్: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి నాలుగు తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులను తస్కరించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... సతీష్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అల్మారాలో భద్రపరిచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య


చెరువులో తేలుతున్న కళావతి మృతదేహం

రాజేంద్రనగర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రిటైర్డ్ ల్యాబ్ టెక్నీషియన్ చెరువు కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కిస్మత్‌పూర్ ఎన్‌ఆర్‌ఐ ప్రాంతానికి చెందిన కళావతి(63) నీలోఫర్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయింది. ప్రస్తుతం భర్తతో కలిసి ఇంటి వద్దే ఉంటుంది. కొన్ని రోజులుగా ఈమె అనారోగ్య సమస్యతో బాధపడుతుడటంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున నిద్ర నుంచి లేచిన కళావతి బయటకు వెళ్లి కొద్ది దూరంలోని ఎర్రకుంట చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం చెరువులో మహిళ మృతదేహం తేలి ఉండడంతో స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతదేహం ఫొటో వివిధ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కుటుంబ సభ్యులు పరిశీలించి పోలీసులను సంప్రదించారు. కళావతి మృతదేహాన్ని గుర్తు పట్టడంతో పోలీసులు పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వజ్రాభరణాలతో ఉడాయించిన కేటుగాడు చిక్కాడు

- రూ.7 కోట్ల విలువైన సొత్తు రికవరీ
- విలేకరుల సమావేశంలో డీసీపీ జోయెల్ డేవిస్


వజ్రాభరణాలను మీడియాకు చూపుతున్న డీసీపీ జోయెల్ డేవిస్

నాంపల్లి: విలాసవంతమైన జీవితాన్ని పొందాలని ఆశించి రూ.7 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాభరణాలతో పారిపోయిన ఓ కేటుగాడిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.7 కోట్ల విలువైన బంగారు వజ్రాభరణాలను రికవరీ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఏసీగార్డ్స్‌లోని పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీసీపీ జోయెల్ డేవిస్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వెలిశెట్టి శ్రీనివాస్ (33) రెండు నెలల క్రితం గచ్చిబౌలిలోని రాధిక డైమండ్స్‌లో డ్రైవర్‌గా విధుల్లో చేరాడు. ఈనెల 17న రాధిక డైమండ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అక్షయ్‌కుమార్ బంగారు చెవి పోగులను ఓ వినియోగదారుడికి చూపెట్టడానికి కారులో మధురానగర్‌కు వెళ్లారు. బంగారు చెవి పోగులను తీసుకుని అక్షయ్ కుమార్ వినియోగదారుడికి దగ్గరకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ శ్రీనివాస్ కారులో ఉన్న మిగతా బంగారు వజ్రాభరణాలతో ఉడాయించాడు. కారు వెనుక సీటులో ఉన్న మరో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పారిపోవడానికి ప్రయత్నించిన డ్రైవర్ శ్రీనివాస్‌ను నిలువరించే ప్రయత్నం చేయగా కత్తితో బెదిరించి కారుతో పారిపోయాడు. వజ్రాభరణాలు కలిగిన కారును నేరుగా బాలానగర్‌కు తీసుకెళ్లి అక్కడ తన బైక్‌లోకి వజ్రాభరణాలను మార్చుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ అక్షయ్‌కుమార్ ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో ఆరు ప్రత్యేక బృందాలతో జల్లెడపట్టారు. వజ్రాభరణాలతో ఉడాయించిన వ్యక్తిని పట్టుకునేందుకు సుమారు 150 సీసీ కెమెరాలలో తనిఖీ చేశారు. తన సొంత బైక్‌పై తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ ఉన్నట్లుగా పోలీసులు నిర్ధారించారు. దోచుకున్న సొమ్మును కొనుగోలుదారుడికి అప్పగించేందుకు డ్రైవర్ శ్రీనివాస్ హైదరాబాదుకు చేరుకున్నారు. బంగారు వజ్రాభరణాలను కొనుగోలుదారుడికి ఇస్తుండగా పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారు. వీటిలో 82 రకాల బంగారు వజ్రాభరణాలు ఉన్నాయని, ఈ సొత్తు విలువ రూ.7 కోట్లు ఉంటుందని డీసీపీ జోయెల్ డేవిస్ తెలిపారు. నిందితుడు మునుపెన్నడూ నేరాలు చేయలేదని, దోచుకెళ్లిన సొమ్ముతో విలాసవంతమైన జీవితాన్ని పొందాలని నేరానికి పాల్పడి ఉంటాడని తెలిపారు. ఈ మేరకు అతడి వద్ద నుంచి రూ.7 కోట్ల విలువైన వజ్రాభరణాలను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందిని ఈ సందర్భంగా డీసీపీ జోయెల్ డేవిస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్దిఖీ, ఏసీపీ మోహన్ కుమార్, ఎస్‌ఆర్‌నగర్ సీఐ సైదులు, డీఐ రామ్ ప్రసాద్, ఎస్సైలు శ్రీకాంత్ గౌడ్, సర్దార్ జమాల్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి


జలమండలి జీఎం రవీందర్‌రెడ్డితో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ సూచించారు. శనివారం వేస్టెండ్ కాలనీలోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నీటి బిల్లులు, నీటి పైప్‌లైన్ పనులు తదితర వాటిపై చర్చించారు. అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వేసవి కాలంలో ప్రజలకు నీటి సమస్యలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంక్ రిజర్వాయర్లను అతిత్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జలమండలి మేనేజర్ రాజా, నరేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజేంద్రనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి జీఎం కురుమయ్య కోరారు. సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం కురుమయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్.మోహన్‌లు మాట్లాడుతూ.. శివరాంపల్లి పీకర్ సెక్షన్ కాలనీ, బుద్వేల్ రైల్వే స్టేషన్, వెంకటేశ్వర కాలనీ, ఎకామ్‌నగర్, ఓల్డ్ కర్నూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. నడిచేందుకు సైతం వీలు లేకుండా రహదారులు పూర్తిగా గోతుల మయంగా మారాయన్నారు. ఈ దారి గుండా ప్రయాణిస్తూ వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతూ ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాడైన రోడ్లను తొలగించి కొత్త సీసీ రోడ్లను వేయాలని కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో నూతన రోడ్లు వేసేందుకు చర్యలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌కు పురస్కారం


నగదు పురస్కారం అందుకుంటున్న కానిస్టేబుల్ రమేష్

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.రమేష్‌ను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అభినందించి నగదు పురస్కారం అందజేశారు. శుక్రవారం రాత్రి ఖానాపూర్‌కు చెందిన అనిత భర్తతో గొడవ పడి హిమాయత్‌సాగర్‌లోకి దూకింది. అక్కడి నుంచి వెళ్తున్న కానిస్టేబుల్ రమేష్ విషయాన్ని గమనించి సాగర్ నీటిలో మునుగుతున్న అనితను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చాడు. అనంతరం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డిలు రమేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అతడికి నగదు పురస్కారంను అందజేశారు.

కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని, గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలను పట్టుకుని తరలించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కుక్కల గుంపులు అధికంగా ఉన్నాయన్నారు. ప్రజలను ఇళ్ల నుంచి బయటకు రానివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, చిన్న పిల్లలు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఎధర్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు బండారి బాలకృష్ణ, సందీప్ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి హరికిషన్, కొంకల వెంకటేష్, రాజేష్‌గౌడ్, మల్లేష్‌చారి, రాహుల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డిజిటల్ పేమెంట్స్ చేయండి

బండ్లగూడ: ప్రజలు తమ ఆస్తి పన్ను తదితర బిల్లులను డిజిటల్ పేమెంట్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. శనివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ బిల్ పేమెంట్స్ సర్వీస్‌ను ప్రారంభించామన్నారు. యూపీఐ యాప్స్ (గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, మొబిక్విక్) తదితర యాప్‌ల ద్వారా పేమెంట్ చేయవచ్చన్నారు. ఆస్తిపన్ను, ఇతర బిల్లులు చెల్లించేందుకు వీటిని ఉపయోగించుకోవాలన్నారు. సులభంగా డిజిటల్ పద్ధతి ద్వారా పేమెంట్ చేసే అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలించిన కౌన్సిలర్ వసంతరావు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు హనుమాన్‌నగర్‌లో ప్రారంభమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కౌన్సిలర్ వసంతరావు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు గృహాల్లోకి వెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను దూరం చేయాలనే ఉద్దేశంతో ఇటీవల ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పనులను ప్రారంభింపజేశామన్నారు. నెల రోజుల్లో పనులు పూర్తయ్యి ప్రజల ఇబ్బందులు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలకు అండగా సీఐటీయూ


కార్మికురాలికి న్యాయం చేస్తామని లిఖిత పూర్వక పత్రాన్ని అందజేస్తున్న పరిశ్రమ నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఐటీయూ ఎప్పుడూ ముందుంటుందని కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ రుద్రకుమార్, కోశాధికారి భాస్కర్‌లు వెల్లడించారు. కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలో పూజా ప్లాస్టిక్ పరిశ్రమలో బిహార్ ప్రాంతానికి చెందిన సునీతదేవికి వేతన ఇవ్వకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి ఆమెకు న్యాయం చేయిస్తామని హామీని ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీహార్ ప్రాంతం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి పూజా ప్లాస్టిక్ పరిశ్రమలో పని చేస్తున్న సునీతదేవికి యాజమాన్యం వేతనం చెల్లించలేదన్నారు. విషయాన్ని తెలుసుకుని పరిశ్రమ ముందు ఆందోళన చేపట్టామన్నారు. దిగి వచ్చిన యాజమాన్యం చర్చలకు ఫలించిందన్నారు. ఆమెకు రావాల్సిన రూ.9500తో పాటు ఇతర బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని రాతపూర్వకంగా హామీ ఇప్పించడం జరిగిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా సెల్: 9394121749 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పనులను త్వరగా పూర్తి చేయండి


ధ్వజస్తంభ ఏర్పాటుకు చెక్కును అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో కొనసాగుతున్న డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలు నెలల తరబడి కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని త్వరగా పూర్తి చేయించాలని మణికొండ మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి కోరారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో పలు కాలనీల వాసులతో దీప దివ్యజ్యోతిని కలిసి పనుల పురోగతిపై చర్చించారు. సెక్రటేరియట్ కాలనీలో నెలల తరబడి డ్రైనేజీ పనులను కొనసాగించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఆ రోడ్డులో ఉన్న షాపుల వారు నెలల తరబడి మూసుకుని అద్దెలు చెల్లించారన్నారు. ప్లేస్కూళ్లు ఉన్న చోట సైతం ప్రమాదభరితంగా పనులు చేశారన్నారు. అనంతరం ఆయన పంచవటి కాలనీలోని శ్రీరామాలయ 3వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. మణికొండ క్వార్టర్స్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటుకు అయ్యే ఖర్చును చెక్కు రూపంలో ఆయన అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ వసంతరావు, కాలనీలవాసులు పాల్గొన్నారు.



'తెలంగాణ ప్రభుత్వం అప్పులపాలు'

- కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్

జియాగూడ: ప్రధాని మోదీ దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేస్తే కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం 'ప్రజాగోస బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా జియాగూడలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, ఆ పథకాలను పేదలకు నేరుగా అందించకుండా పేర్లను మార్చి తన పథకాలుగా కేసీఆర్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జ్ కిషన్‌ధామా, బూత్ అధ్యక్షుడు మారుతి, రాహుల్, శివాజీ, డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ మునేందర్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సిములు, శివయాదవ్, వెంకటేష్ యాదవ్, రాజ్‌పాల్, నరేష్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కలను చూసి భయపడొద్దు

మణికొండ: కుక్కలను చూసి మనం భయపడినట్టే అవి మనల్ని చూసి భయపడతాయని, వాటి ముందు అనుమానాస్పదంగా పరుగెత్తడం, వాటిని కొట్టడం చేస్తేనే అవి మనల్ని కరిచేందుకు ప్రయత్నిస్తాయని బ్లూక్రాస్ ప్రతినిధి జయశ్రీ పేర్కొన్నారు. శనివారం మణికొండ ప్రాథమిక పాఠశాలలో కుక్కలు దాడి చేసినపుడు ఎలా ఆత్మరక్షణ చేసుకోవాలి, వాటితో స్నేహంగా ఎలా మెలగాలి, అవి గుంపుగా ఉన్నపుడు ఎలా వెళ్లాలి అనే అంశంపై విద్యార్థులకు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంట్ ఇన్‌చార్జి సంపత్, సూపర్‌వైజర్ నవీన్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కుక్కల నుంచి ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న జయశ్రీ


పేద విద్యార్థులకు చేయూత


ఖానాపూర్‌లో నోట్ పుస్తకాలను అందించిన సీబీఐటీ విద్యార్థులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతు చేయూత నందిస్తామని సీబీఐటీ ప్రొఫెసర్ యూకే చౌదరి అన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట ప్రభుత్వ పాఠశాల 9, 10వ తరగతుల విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై అవగాహన, ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కథల పుస్తకాలు, డిక్షనరీలు, డ్రాయింగ్, నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సహాయ ప్రొఫెసర్ డాక్టర్ టీవీఎస్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలోకి వెళ్లకుండా గోడ నిర్మాణం

- నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానికుల డిమాండ్
- మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మకు ఫిర్యాదు


శ్మశాన వాటికకు అడ్డుగా నిర్మించిన గోడ

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలో శ్మశాన వాటికలోకి వెళ్లకుండా అడ్డుగా ప్రహరీ నిర్మాణం చేపట్టడంపై కాలనీవాసులు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మకు వినతి పత్రం అందజేశారు. ఎయిర్‌పోర్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు కాలనీతో పాటు పక్కనే శ్మశాన వాటికను అప్పటి హెచ్ఎండీఏ అధికారులు కేటాయించారన్నారు. గత పద్దెనిమిదేళ్లుగా సుమారు 600 సమాధులు కూడా అందులో ఉన్నాయన్నారు. శ్మశాన వాటికలోకి ప్రవేశం లేకుండా అడ్డుగా మున్సిపాలిటీ గోడను నిర్మాణం ఎందుకు చేస్తోందని ప్రశ్నించారు. ఇటీవల మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సైతం నిధులు కేటాయిస్తూ శంకుస్థాపన సైతం చేసినట్లు గుర్తు చేశారు. వెంటనే గోడ నిర్మాణం నిలిపివేయడంతో పాటు తొలగించాలని డిమాండ్ చేశారు.


చైర్‌పర్సన్ సుష్మకు వినతి పత్రం ఇస్తున్న ఎయిర్‌పోర్టు కాలనీ వాసులు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంజన్‌కుమార్


కార్నర్ మీటింగ్‌లో భాగంగా బీజేపీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

మణికొండ: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా శనివారం ఏడు చోట్ల కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఆయా సమావేశాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ఇప్పటి వరకు చేయలేదన్నారు. దీంతో రైతులంతా బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మిగిలి కొత్త రుణాలు తీసుకోలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు పది వేల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.3వేల నిరుద్యోగ భృతి మాటే లేదన్నారు. ఇళ్లు లేని వారందరికీ డబుల్ బెడ్రూమ్ ఇస్తానని ప్రకటించి రాష్ట్రంలో రూ.15 లక్షలకు పైగా దరఖాస్తులు వస్తే కేవలం రూ.లక్ష లోపే మంజూరు చేశారన్నారు. దళిత బంధు పథకంలోనూ పదుల సంఖ్యలో మందికి మాత్రమే ఇచ్చి లక్షలాది దళితులను మోసం చేస్తున్నారన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ అని ఊదరగొట్టడంతో పంటలు వేసుకున్న రైతులు ప్రస్తుతం ఐదు గంటలు సరిగా రాకపోవడంతో అవి ఎండిపోతుండటంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇలాంటి మాటలు చెప్పి పనులు చేయని ప్రభుత్వాన్ని సాగనంపి డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తెచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు వీరప్ప, మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నాయకులు పి.శ్రీనివాస్, మహాలింగంగౌడ్, డి.లక్ష్మీనారాయణ, పి.సత్యనారాయణ, శ్రీకాంత్‌స్వామి, వందన, సిద్ధప్ప, ఇందిర, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్యచారి, శంకర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాంబాగ్‌లో 'ప్రజా గోస–బీజేపీ భరోసా'


సమావేశంలో మాట్లాడుతున్న విద్యాపాండే

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లో 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు విద్యాపాండే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి, ఆర్.రాజశేఖర్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నులిగే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230